# ఉదార స్వభావులు

సుమారు ఉదయం పదిగంటలై ఉంటుంది.

వార్డులోకి రాగానే ముందు నా బెడ్ దగ్గరకు వచ్చి, ఛీఫ్ మెడికల్ ఆఫీసరుగారు "ఏమయ్యా ఎలా ఉంద"? అన్నారు.

"నొప్పి బాగా తగ్గింది. కులాసాగానే ఉన్నా. మరి ఎప్పుడు డిస్చార్జ్ చేస్తారు?" అన్నా.

"ఏం? నీకు ఇక్కడ ఉండడానికి కష్టంగా ఉందా?" అన్నారు.

"మీ దయవల్ల అటువంటి దేమీ లేదనుకోండి. అయినా ఎంత ప్రేమగా చూసినా పంజరంలోని చిలుక ఎగిరిపోవడానికి ప్రయత్నించడం సహజమేగా" అన్నా. ఆయన నవ్వుతూ, నా భుజంమీద ఓసారి తట్టి "నువ్వు ఇలా మంచంమీద ఉంటే నాకూ ఎంతో ఇబ్బందిగానే ఉంది. కాని ఏం చెయ్యడం? మరో నాలుగు రోజులు ఓపికపట్టు. డిస్చార్జి చేస్తా. ఆ తరువాత కట్టు కట్టుకోవలసిన అవసరంకూడా ఉండదు." అన్నారు.

వార్డులోని ఒక్కొక్క రోగి దగ్గరకూ స్వయంగా వెళ్ళి వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకుంటూ, అవసరమైనచోట్ల ఆ వార్డు సర్జనుకు ట్రీట్‌మెంట్ విషయాలలో తగిన సలహాలిస్తూ విజిటింగు పూర్తి చేసే సరికి ఇంచుమించు పన్నెండుగంట లయింది. ఆయన వెళ్ళిపోయారు. ఆయన వెనకాలే మిగిలిన డాక్టర్లూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

దూరాన్న ఉన్న కొండలను, ఆ కొండలపై మేతకై స్వేచ్ఛగా తిరుగుతున్న పశువులను, పశువుల కాపరులను, చూస్తూ ఏదో ఆలోచిస్తున్నా. ఇంతలో గోపాలరావుగారు చెమటలు తుడ్చుకుంటూ వచ్చి "ఏమండీ ఆలస్యమయిందా?" అంటూ కేరియరు అందించారు. నేను భోజనంచేసేవరకూ ఉండి ఆ తరువాత ఆ కేరియరు తీసుకుని సాయంత్రం మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయారు. స్నేహితులలోకూడా, ప్రతిఫలం వాంఛించకుండా అవసర సమయాలలో శ్త్రీవంచనలు లేకుండా శ్రమ అనుకోకుండా సహాయపడే వాళ్ళుంటారు. లేకపోతే పుట్టి, పెరిగిన తెలుగుదేశానికి వెయ్యిమైళ్ళ దూరంలో, బంధువులకు, పరిచితులకు అందుబాటులో లేని పరిస్థితిలో గోపాలరావుగారు, మూర్తిగారిలాంటి మంచి స్నేహితులే లేకపోయి ఉంటే, కదలలేని పరిస్థితిలో ఆస్పత్రి మంచంమీద ఎన్ని ఇబ్బందులు పడవలసివచ్చేదో?

రెండు రోజులనుండి ఆస్పత్రి మంచం మీద ఇన్‌పేషెంటుగా ఉంటున్నా ఆ వార్డులోని మిగిలిన రోగులు ఎవరితోనూ ఏ సందర్భంలోనూ మాట్లాడలేదు. అంతగా కలుగజేసుకుని మాట్లాడుదామన్నా అంతా బెంగాలీలు, హిందీ మాట్లాడేవాళ్ళు. నాకు ఎదురుగా

పి. నరసింగరావు

ఉన్న పద్దెనిమిదో నెంబరు బెడ్ మీద ఉన్న పదహారేళ్ళ కుర్రాడు మాత్రం నన్ను ఎంతగానో ఆకర్షించేవాడు. వయస్సు అంత పెద్దది కాకపోయినా, ఒడ్డు పొడుగుతో మంచి శరీరదారుఢ్యంతో ఉన్నాడు. కాని కుడికాలు ముణుకుపైగా తీసివేయబడింది. అతని స్థితి చూస్తే చెప్పలేని జాలివేసేది. తాత్కాలికంగానయితే రెండు రోజులు కుంటిగా నడవవలసివస్తేనే, మానసికంగాను, శారీరకంగానూ ఎంతగానో బాధపడుతున్నా. అలాంటిది, అంగవైకల్యంతో శాశ్వతంగా, యావజ్జీవితం కుంటుతూ నడవాలంటే, ఆ అబ్బాయి ఎంతగా క్రుంగిపోయేడో? ఎంత బాధపడ్డాడో? అతనికథ తెలుసుకుందామనిపించింది. సంజ్ఞచేసి రమ్మని పిలిచా. రెండు చంకలక్రింద రెండు కర్రలను ఆనుకునివచ్చి నా మంచందగ్గర స్టూలుమీద కూర్చున్నాడు.

"ఎంచేత కాలు తీసేశారు?" అన్నా హిందీలో.

"మీకు తెలియదా? పేపర్లో కూడా పడిందే. గత మాఘ పౌర్ణమినాడు..." అంటూ చెప్పబోయాడు.

అంతలోనే అతని మాటకు అడ్డుపడి "ఆ...ఆ...జ్ఞాపకం వచ్చింది" అన్నా. అప్పటికి సుమారు పదినెలల క్రితం జరిగిన విషయం. ఆనాడు మాఘ పౌర్ణమి. గంగానదిలో స్నానం చెయ్యడానికి చుట్టుప్రక్కల గ్రామాలనుంచి ముంగేరు లక్షల కొద్ది జనం వచ్చేరు. ముంగేరు బీహార్‌లోని ఒక జిల్లాకు ప్రధానపట్నం. గంగానది ఒడ్డున ఉన్నది. నది ఒడ్డున స్నానఘట్టాలు, వాటపక్కనే ఒక శివాలయం ఉన్నాయి. నాతోనే కలిసి ఉంటున్న మిగిలిన తెలుగు స్నేహితులు స్నానానికి నన్నుకూడా రమ్మన్నారు. కాని సాధారణంగా జనసమ్మర్దంగా ఉన్న ప్రదేశాలకు, అందులో అలాంటి తీర్థాలకు వెళ్ళడం నాకు నచ్చనిపని. పైగా, 'రాత్రి వెన్నెలలో గంగానది ఒడ్డున కూర్చుని కాలక్షేపం చేస్తే హాయిగా ఉంటుంది. అంతేగాని దొమ్మిలో వెళ్ళడం ఎందుకు?' అన్నా. నా మాటలు ఎవరికీ రుచించలేదు. నేను తప్ప మిగిలినవాళ్ళు వెళ్ళిపోయారు. ఆనాడు ఈ కుర్రాడూ మిగిలిన స్నేహితులతో కలిసి, ఆడుతూ పాడుతూ స్నానంచేసిన తరువాత ఇంటికి తిరిగివెళ్ళడానికి, కదులుతూన్న రైలు ఎక్కబోయాడు. అప్పటికే డబ్బాలో కిక్కిరిసి ఉన్న ప్రయాణీకులతో పెట్టెలోకి వెళ్ళడానికి వీలుపడక ఫుట్‌బోర్డుమీద నిలబడ్డాడు. బాగా తడిగా ఉండడంవల్ల, కాలు జారి క్రిందపడ్డాడు. కాలు తెగిపోయింది. ఇదీ కథ.

"అయితే ఈ పదినెలలబట్టీ ఆస్పత్రిలో ఉన్నావన్నమాట," అన్నా.

"ఔనండీ. ఇంతకన్నా కంఠం తెగి ఉంటే ఎంతో బాగుండేది," అన్నాడు కళ్ళనీళ్ళతో.

"దుఃఖపడితే మాత్రం ఏంలాభం? ధైర్యం తెచ్చుకుని జీవితాన్ని వెళ్ళబుచ్చవలసిందే" అన్నాను.

అతను కంటినీరు తుడుచుకుంటూ, "మీది ఏదేశం? ఇక్కడ ఏం చేస్తున్నారు?" అన్నాడు.

"నేను తెలుగుదేశంనుంచి వచ్చా. పెద్ద


కలవరపడు స్త్రీలకు

"కుమారి" మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతఅనవసరం వెల (సాదా) రు. 3/- (స్పెషల్) రు. 5/- (ఎక్స్‌ట్రా స్పెషల్) 8/- పోస్టేజి ప్యాకింగు ప్రత్యేకం.

Available also from all Chemists of Madras City.

P. DEVEE & CO. (A.P.) Calcutta-40

డాక్టరుగారివద్దే పనిచేస్తున్నా" అన్నా.

"అందుకే మీరంటే అందరూ శ్రద్ధ చూపిస్తున్నారు," అన్నాడు.

నవ్వి ఊరుకున్నా.

"మీరు విశ్రాంతి తీసుకుంటారేమో తీసుకోండి" అన్నాడు అతను వెళ్ళిపోవడానికి ఉపక్రమిస్తూ.

నాకూ నిద్రవస్తూ ఉండడంనుంచి, "ఆ ఒక్క గంట కన్నుమూస్తా" అని పడుకున్నా.

* * *

సాయంత్రం సుమారు ఐదున్నర గంటల ప్రాంతంలో టికెట్ కలెక్టర్ గా పనిచేస్తున్న శర్మ అనే స్నేహితుడు వచ్చాడు.

"ఏం బ్రదర్, సైకిలుమీదనుంచి పడి కాలు దెబ్బ తగిలిందట. గోపాలరావు గారు చెప్పేరు. ఇప్పుడు ఎలా ఉంది?" అన్నాడు.

"కాస్త బాగానే ఉంది. దాని ధర్మమా అని కాలు విరగలేదు. బహుశా మరో మూడు నాలుగు రోజులలో డిశ్చార్జి చేస్తారు" అన్నాను.

ఇంతలో ఒక బెంగాలీ నర్సువచ్చి నా టెంపరేచర్, పల్సు తీసుకుంటుంది. నిజానికి ఆమె చాలా చక్కనిదనే చెప్పాలి.

శర్మ తదేకదీక్షగా ఆమెను చూస్తున్నాడు. శర్మకూడా బాగానే ఉంటాడు. దానికితోడు వేషం పటాటోపంగా ఉంటుంది.

"ఏమండీ కాలు సమంగా పెట్టుకుని పడుకోమని డాక్టరుగారు ఎన్నిసార్లు చెప్పేరు?" అని నవ్వుతూ తన చేతులతో నా కాలు ఎలాగ పెట్టాలో అలాపెట్టి ప్రక్క రోగివద్దకు వెళ్ళిపోయింది. ఆమె శర్మవైపు చూడనేలేదు. శర్మ ప్రయత్నం వ్యర్థమయింది.

"నీపనే బాగుంది. దెబ్బ తగిలితేనేం, చక్కగా సేవలు చేయించుకోవచ్చు. అందులో నువ్వు రాజాగారి బావమరిదివి. నీకేం లోటు?" అన్నాడు అసూయగా.

"అదే భ్రమ. నర్సులు చూపించే ఆదరణ, వాళ్ళుచేసే సేవా ఆస్పత్రి మంచంలో ఉన్నంతసేపే. ఆ తరువాత కావాలనుకున్నా లభ్యం కావు" అన్నా.

"ఆ, ఇప్పుడు అనుభవిస్తున్నది చాలదా?" అన్నాడు.

కాసేపు అది ఇదీ మాట్లాడి మళ్లీ వస్తానని చెప్పి శర్మ వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు ఉదయం తొమ్మిదిగంటలకు మళ్లీ పెద్దడాక్టరుగారు వచ్చారు. కాలు తీసేసిన అబ్బాయి వద్దకు వెళ్లేరు. ఆ సమయానికి ఆ అబ్బాయి తండ్రికూడా ఉన్నాడు.

ఆ అబ్బాయిని చూసి "నీ గాయం పూర్తిగా మానింది. ఈదినం ఇంటికి వెళ్లవచ్చు. ఇంటికి వెళ్లి ఏం చెయ్యదల్చుకున్నావు?" అన్నారు.

"క్షేత్రఫారంలో మళ్ళీ చేరుతా," అన్నాడు, ఆ అబ్బాయి.

"చూడు. నీకోసం, గత పదినెలలనుంచి నీతండ్రి ఎంతో సొమ్ము ఖర్చుచేస్తున్నాడు. రెండుపూటలా నీకోసం, నాలుగు మైళ్ళ దూరంనుంచి వస్తూపోతున్నాడు. నువ్వు ఒకరికి సహాయపడలేకపోయినా, జీవితాంతం ఇంకొకరికి భారంకాకుండా స్వతంత్రంగా జీవించడానికి ప్రయత్నించు. బాగా చదువుకుని వృద్ధిలోకిరా" అన్నారు.

"లేదండి. ఇదివరకులా కాకుండా కష్టపడి చదువుతా" అని డాక్టరు గారికి నమస్కరించాడు.

డాక్టరుగారు కుర్రవాని తండ్రితో "ఈదినం ఇంటికి తీసుకుపోవచ్చు. ఎప్పుడైనా అవసరమైతే నావద్దకు తీసుకురావచ్చు," అన్నారు.

"మీరు మామీద చూపించినదయ, అభిమానం ఈ జన్మలో మరచిపోలేం. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం. భగవంతుడు ఎల్లప్పుడూ తమలాంటి వారికి సహాయపడతాడు," అని పెద్ద డాక్టరుగారికి హృదయపూర్వకంగా నమస్కరించి అబ్బాయిని తీసుకుని ఆయన వెళ్లిపోయాడు.

వెళ్ళేముందు ఆ అబ్బాయి నా వద్దకు వచ్చి "వస్తానండీ" అని చెప్పి వెళ్ళిపోయాడు.—

రాత్రి ఎనిమిది గంటలవరకూ ఆ అబ్బాయి ఖాళీచేసిన పద్దెనిమిదో నెంబరు బెడ్ ఖాళీగానే ఉంది. గోపాలరావుగారి ధర్మమా అని ఆయన తెచ్చిన భోజనంచేసి, కొంతసేపు ఆయనతో మాట్లాడి, ఆయన వెళ్ళిపోయిన తరువాత ఆ దినమే వచ్చిన ఆంధ్ర పత్రిక చదువుతున్నా.

ఇంతలో అంబులెన్సు వచ్చి పోర్టికోలో ఆగింది. ఇద్దరు ముగ్గురు వార్డునౌకర్ల సహాయంతో, సుమారు ముప్ఫైఏళ్ళ ఆసామీ ఒంటినిండా రక్తస్నాతుని, బలహీనంగా మూలుగుతూ, వచ్చి పద్దెనిమిదో నెంబరు బెడ్ మీద పడుకున్నాడు. ఆయనతోనే, సుమారు ఇరవైనాలుగు సంవత్సరాల ప్రాయంగల ఒక స్త్రీ, ఐదేళ్ళ అమ్మాయి, మూడు సంవత్సరాల ఒక అబ్బాయి కూడా వచ్చారు. మిగిలిన రోగులందరి దృష్టులూ ఒక్కసారి కొత్తరోగిపై ప్రసరించాయి. కొద్దిసేపట్లోనే, కొత్త రోగితో వచ్చినవాళ్ళు అతనిభార్య, పిల్లలు అని తెలిసింది.

అప్పటికప్పుడే డాక్టర్లు అందరూ ఇళ్లకు వెళ్ళిపోవడంనుంచి నర్సు వచ్చి టెంపరేచరు, పల్సు తీసుకుని, మందు తాగించి, తలపై ఐస్ బేగ్ ఉంచి, అతనిభార్యకు ధైర్యంచెప్పి ఆ తరువాత రోగి స్థితిగతులు ఆ వార్డు సర్జనుకు టెలిఫోన్ద్వారా తెలియజేసింది.

రాత్రి తొమ్మిదిన్నరగంటల ప్రాంతంలో ఆవార్డు సర్జనుగారువచ్చారు. అప్పటికప్పుడే రోగి ఊపిరితీసుకోవడానికి చాలాబాధ పడుతున్నాడు. డాక్టరుగారు తనిఖీచేసి, ఇంజక్షనుఇచ్చి కొంతసేపు రోగిమంచంవద్ద కూర్చున్నారు. రోగికి నెమ్మదించింది.

రోగి భార్యనుచూస్తే ఎవరో భాగ్యవంతులు, పరిస్థితులవల్ల దారిద్ర్యానికి లోబడ్డవాళ్ళని తెలుస్తూంది. తీర్చిదిద్దిన, కన్ను, ముక్కు, ముఖంతో ఎంతో నిండుగా ఉంది. ఆతురతతో, భయంతో కళ్ళంట నీరుకారుస్తూ పదేపదే భర్త యోగక్షేమాలు తెలుసుకుంటూంది.

డాక్టరుగారు ఆమెతో మరేం భయం లేదనీ, కావాలంటే ఆరాత్రి ఆస్పత్రిలో ఉండవచ్చనీ చెప్పేరు. అవసరమైతే వెంటనే ఫోన్ చెయ్యమని, జాగ్రత్తగా రోగిని కనిపెట్టుకుని ఉండమని నర్సుతో చెప్పి ఇంటికి వెళ్ళిపోయారు.

పదకొండు గంటల ప్రాంతంలో వాతావరణం చల్లబడడంనుంచి నాకు తెలియకుండానే నిద్రపట్టింది.

బహుశా తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో, "సిస్టర్! ఆక్సిజెన్, కోరమిన్" అన్నమాటలువిని ఉలిక్కిపడి లేచా. పద్దెనిమిదో నెంబర్ బెడ్‌వద్ద ఆ వార్డు సర్జను, పెద్దడాక్టరుగారూ ఉన్నారు. వాళ్ళ తాపత్రయంచూసి పరిస్థితి విషమించిందని తెలుసుకున్నా. ఇంచుమించు మిగిలిన రోగులుకూడా అందరూ మేల్కొని ఆవైపే ఆతురతగా చూస్తున్నారు.

పెద్దడాక్టరుగారు సిగరెట్టు కాలుస్తూ తీక్షణంగా ఆలోచిస్తూ వరండాలోకి వెళ్లేరు. ఆ వార్డు సర్జనుగారు, రోగికి, ఆక్సిజన్ ఇంజక్షన్ ఇవ్వడంలో నిమగ్నులయారు.

పెద్దడాక్టరుగారు వరండాలోకి వెళ్ళగానే, రోగిభార్య ఆయన కాళ్ళమీదపడి, ఎలాగైనా తనభర్త ప్రాణాలు కాపాడమని వెక్కివెక్కి ఏడుస్తూంది.

"మరేం భయం లేదమ్మా, నువ్వు అనవసరంగా భయపడకు" అన్నారు.

కాని ఎందుచేతో ఆమెకు ఆయన మాటలమీద నమ్మకం కలగలేదు. ఆమె ఆయన కాళ్లను వదలకుండానే చెప్పుకుపోతూంది.

"పాకిస్తాన్ మత కల్లోలాలలో మా కుటుంబాలన్నీ ఆహుతి ఐపోయాయి. ఆస్తులన్నీ


## అసాధారణ చికిత్స

ఆశలు వదలుకొన్న కుష్ఠ రోగులకు అను వారాల అసాధారణచికిత్స ఆశలు రేకెత్తించును. మొండి చర్మ వ్యాధులకు కూడా చికిత్స చేయబడును.

వెంటనే సలహా తీసుకోండి:

అశోక్ స్కిన్ క్లినిక్

1/200, టంకసాల వీధి,

(రాముని గుడిదగ్గర) మద్రాసు-1.

శని, ఆదివారాలలో మాత్రం పనిచేయును

# ★ ఉదారస్వభావాలు ★

పోగొట్టుకున్నాం. మేం ఇద్దరం, పిల్లలం పడరాని పాట్లు పడ్డ తరువాత ఎలాగో ప్రాణాలతో బయట పడ్డాం. గతసంవత్సరమే ఆయనకు రైల్వేలో గుమాస్తా నౌఖరి లభించింది. నాకూ పిల్లలకు ఈ ప్రపంచంలో ఆయన తప్ప మరెవ్వరూ దిక్కు లేరు, మరో ఆధారం లేదు. ఆయనను కాపాడే భారం మీదే" అని దీనాతిదీనంగా ప్రార్థిస్తూంది.

పెద్ద డాక్టరుగారికి సుమారు ఏభైసంవత్సరాల వయస్సుంటుంది. దయాస్వరూపులు, "ఆయన ప్రాణాలకు మరేం భయం లేదమ్మా మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం" అని ఆమెను ఆదరంతో ఓదార్చి, రోగివద్దకు వచ్చారు.

సుమారు పన్నెండున్నరగంటలు కావొచ్చింది. తెలతెల వారుతూంది. వెలుగు తెరలు చీకట్లను వెంటాడుతున్నాయి. నూతనోత్సాహంతో పక్షుల కిలకిలారవం వినసొంపుగా ఉంది. దూరానవున్న కొండలు చెట్లు ఒకటి ఒకటే స్పష్టంగా కనపడుతున్నాయి. అంతవరకూ ఒంటిమీద స్పృహ లేకుండా బాధపడుతున్న రోగిని బ్రతికించడానికి ఎన్నివిధాల ప్రయత్నించాలో అన్నివిధాలా ప్రయత్నించారు. కాని కష్టానికి ఫలితం లేకపోయింది. రోగి ఆ ప్రశాంత వాతావరణంలో శాశ్వతంగా కన్నుమూశాడు. ఆ ఇల్లాలి జీవితం, గాఢాంధకారబంధురమైంది.

ఆ ఇల్లాలు తల నేలకు వేసి మొత్తుకుంటూ విపరీతంగా ఏడుస్తూంది. తల్లిని చూచి పిల్లలిద్దరు కూడా గుండెలు బద్దలయేటట్లు ఏడుస్తున్నారు.

చిన్నబోయిన ముఖంతో "ఏం చేస్తామమ్మా! విషజ్వరం, ఎన్నివిధాల ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది." అన్నారు డాకరుగారు.

ఆక్సిజన్ మొదలైన పరికరాలు తీసి వేశారు. రోగిని పూర్తిగా కప్పివేశారు.

అలాంటి సంఘటనలు ఆస్పత్రిలో కొత్త కాకపోయినా, ఎందుచేతో ఆ ఇల్లాలిని పిల్లలిని చూసి అందరూ విపరీతంగా జాలిపడుతున్నారు.

పెద్ద డాక్టరుగారి సలహా ప్రకారం, ఆ ఇల్లాల్నిద్దరు బలవంతంగా రెక్కలు విరిచి పట్టుకున్నారు. మరొకరు పిల్లలిని దూరంగా తీసుకు వెళ్ళేరు.

పెద్ద డాక్టరుగారు "చూడమ్మా మీవాళ్ళు ఎవరు లేరా?" అన్నారు.

ఆమె మాట్లాడలేక మాట్లాడలేక, దుంఖాన్ని దిగమింగుతూ "నాకూ, పిల్లలకు ఈ ప్రపంచంలో మరెవ్వరూ దిక్కు లేరు. మరే ఆధారం లేదు. ఆ చావు కనీసం నాకు వచ్చినా, పిల్లలైనా బాగుపడేవాళ్లు" అని మళ్లీ విపరీతంగా ఏడుస్తూంది.

ఇంతలో, చనిపోయిన ఆసామీతో పని చేస్తున్న ఇద్దరు ముగ్గురు తోటి గుమాస్తాలు వచ్చారు. వాళ్ళలో ఇద్దరు ముగ్గురు స్త్రీలు కూడా ఉన్నారు.

పెద్ద డాక్టరుగారితో, దహన క్రియలకు వగైరాలకు తగిన ఏర్పాట్లు తామంతా కలిసి చేస్తామని చెప్పేరు. డాక్టరుగారు కొద్దిసేపు తీక్షణంగా ఆలోచించి "చూడండి. ఆ అమ్మాయిని, పిల్లలిని, నాలుగైదు రోజులలో నన్ను ఆఫీసులో కలియమని చెప్పండి," అని చెప్పి కారులో వెళ్ళిపోయారు.

మరి కొద్ది సేపట్లోనే రోగి భార్యను, పిల్లలను బలవంతంగా ఇంటికి తీసుకు వెళ్ళిపోయారు. మృత దేహాన్ని కూడా దహన క్రియలకు తీసుకు వెళ్ళిపోయారు...

* * *

నాలుగైదు రోజులయాయి నా గాయం పూర్తిగా మానింది. మామూలుగా ఆఫీసులో పని చేస్తున్నా. ఆ దినం సాయంత్రం, నాలుగు గంటలకు ఆమె, పిల్లలు వచ్చారు. అప్పటికి డాక్టరుగారు ఇంకా ఆస్పత్రినుంచి ఆఫీసుకు రాలేదు. నన్ను చూచి ఆమె గుర్తుపట్టింది. "కొద్ది సేపట్లోనే డాక్టరుగారు వస్తారు. అంతదాకా బెంచిమీద కూర్చోండి" అని ఆమెతో చెప్పి మామూలుగా నా పని చేసుకుందామని కూర్చున్నా. కాని మిషన్‌మీద చేతులు నడవడం లేదు. ఈ నాలుగు రోజులలో ఆమె ఎంతగా చిక్కి శల్యమయింది? వైధవ్యం, ఎంతగా క్రుంగదీస్తుంది? అందులో చేరదీసి ఓదార్చగల దగ్గర బంధువులు లేకపోతే, ఇతరత్రా ఆస్తిపాస్తులు లేకపోతే పరిస్థితి ఎంత హీనంగా ఉంటుందో! ఇంతకు డాక్టరుగారు ఎందుకు పిలిపించారో? ఇలా రకరకాలుగా ఆలోచిస్తున్నా. ఇంతలో కారాగింది. డాకరుగారు వచ్చారు. ఆయనతోబాటు ఆయన భార్య కూడా ఉన్నారు.

కొద్ది సేపట్లోనే ఆమెను గదిలోనికి పిలిపించారు. ఆమె పిల్లలూ వచ్చారు.

"ఏమమ్మా బొత్తిగా చిక్కి శల్యమయావు? నువ్వే ఇలాగయితే మరి నీ పిల్లల గతేమిటి?" అన్నారు.

"ఏం చెయ్యమంటారండీ. ఆయన మమ్మల్ని అన్యాయంచేసి వెళ్లిపోయారు. ఈ పిల్లల్ని ఎలా పెంచడమో దారీ తెన్నూ తోచక రాత్రీ పగలూ ఏడుస్తున్నా" అని కళ్లనీరు తుడుచుకుంటూ "చూడమ్మా నువ్వు ఇలా ఏడుస్తూ కూర్చుంటే నీపిలలు నాశనమౌతారు. జరగిందేదో జరిగిపోయింది. నీపిల్లల కోసమైనా నువ్వు కష్టపడాలి, తప్పదు" అన్నారు.

ఆమె మౌనంగా ఊరుకుంది.

మళ్లీ డాక్టరుగారే చెప్పేరు. "చూడమ్మా నువ్వు చిన్నతనమును కోకపోతే నేనొక సహాయం చెయ్యదలిచాను ఆయాగా ప్రస్తుతం ఒక పని ఖాళీ ఉంది. అన్ని కలుపుకుని నెలకు డెబ్భై రూపాయలు ఇస్తారు. చేస్తానంటే ఆపని ఇస్తాను" అన్నారు.

ఆమె కొద్ది సేపు ఆలోచించి, "పిల్లల కోసం, ఏపని చెయ్యడానికైనా సిద్ధమే" అంది.

డాక్టరుగారి భార్య "ఏమమ్మా! నువ్వు ఏమైనా చదువుకున్నావా" అన్నారు.

"ఫోర్తు ఫారం పాసయాను" అంది.

"నేను బి. ఏ. ప్యాసయాను. మా అమ్మాయి ఈమధ్యనే మెట్రిక్ ప్యాసై ఇంటరులో చేరింది. నీవు ఆమె పుస్తకాలు తీసుకుని, తీరిక సమయాలలో నావద్ద చదువుకుని రెండు మూడు సంవత్సరాలు కష్టపడావంటే ఆతరువాత మెట్రిక్ ప్యాసై ఇంతకన్నా గౌరవనీయమైన ఉద్యోగం సంపాదించుకోవచ్చు" అన్నారు డాక్టరుగారి భార్య.

"మీ ఇష్టప్రకారం నడుస్తా" అంది ఆమె.

డాక్టరుగారు నావైపు తిరిగి, ఆయా పనికై ఒక అప్లికేషన్ టైపు చేసి ఇమ్మన్నారు. టైప్ చేసి ఆమె చేత సంతకం పెట్టించి ఇచ్చా. హెడ్ గుమాస్తాను పిలిచి ఫైల్ తెప్పించి వెంటనే ఆమెను ఎపాయింటు చేసినట్లు ఆర్డర్లు వేశారు. అంతవరకూ, తన అభ్యర్థికి ఆ ఉద్యోగం దొరుకుతుందన్న ఆశతో ఉన్న హెడ్ గుమాస్తాగారు, ఆమెను, పిలలనూ వింతగా చూస్తూ తెల్ల ముఖం వేసి వెళ్ళిపోయారు.

డాక్టరుగారు ఆమె వైపు తిరిగి 'చూడమ్మా నేను పెద్దవాణ్ణి అంచేత అనుభవం మీద ఒక మాట చెప్పదలిచా. నువ్వు ఇంకా వయస్సులో ఉన్నావు. ఎలాంటి పరిస్థితిలోనూ తప్పు త్రోవను పడక మంచిగా, కష్టపడి పనిచేసుకున్నావంటే తప్పక అభివృద్ధిలోకి వస్తావు నీపిల్లల భవిష్యత్తు బాగు పడుతుంది. ఈవిషయం ఎన్నడూ మరువకు. రేపే పనిలో చేరు" అన్నారు.

ఆమె కృతజ్ఞతతో, సెలవు తీసుకుని వెళ్లిపోయింది. డాక్టరుగారు, ఆయన భార్య యొక్క ఉదారస్వభావాలను మనసులోనే మెచ్చుకుంటూ తేలికపడ్డ మనస్సుతో మళ్ళీ నాపనిలో మునిగిపోయా... ★